




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 7-4-2025

సంపుటి: 21 సంచిక: 11

పేజీలు: 8 వెల: రూ.1




# డీఎంహెచ్‌వో కార్యాలయానికి మద్దెలదరువు





జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఒకవైపు విజిలెన్స్, మరోవైపు ఏసీబీ తిష్టవేశాయి. నేరుగా మహిళా ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ డీఎం హెచ్‌వో, ఆయన సీసీ ఏసీబీకి దొరికిపోగా.. అంతకు క్రితమే ఈ కార్యాలయంలో పని చేస్తున్న 12 మంది ఉద్యోగులపై బదిలీలు, ఉద్యోగ నియామకాలు, డిప్యూటేషన్లు వంటి వ్యవహారాల్లో లక్షలాది రూపాయలు వసూలు చేశారన్న ఫిర్యాదు మేరకు విజిలెన్స్ శాఖ దర్యాప్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి రికార్డులు తీసుకువెళ్లి పరిశీలిస్తోంది. అలాగే టెక్నికల్ అంశాల క్లారిఫికేషన్ కోసం డీఎం హెచ్‌వో కార్యాలయంలోనే రికార్డులను పరిశీలిస్తోంది. ఇది చాలదన్నట్లు రీపోస్టింగ్ ఆర్డర్ ఇచ్చినా, వర్క్ ప్లేస్ ఇవ్వకపోవడంతో ఏసీబీకి దొరికిపోయిన డీఎంహెచ్‌వో వద్ద బాధితురాలి ఫైల్ ఉందా? లేదా? అని ఏసీబీ అధికారులు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎంక్వైరీ చేస్తున్నారు. వర్క్‌ప్లేస్ ఫేవర్ చేయడానికే డీఎంహెచ్‌వో లంచం అడిగారని నిరూపించాల్సిన బాధ్యత ఏసీబీ అధికారులపై ఉంది. ఇందుకు సంబంధించి బాధితురాలు డీఎంహెచ్‌వోకు పెట్టుకున్న ఫైల్ వివరాల కోసం ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

- ✶అక్కడ అందరూ దొరకని దొంగలే?
- ✶ఒకవైపు విజిలెన్స్ మరోవైపు ఏసీబీ విచారణ
- ✶అయినా దొరికింది కొందరు ఉద్యోగులే
- ✶అడుగడుగునా అవినీతి ఆనవాళ్లే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 12 మంది ఉద్యోగులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్టు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఆ శాఖలోని ఒక సంఘం నాయకుడు ఫిర్యాదు చేశారు. 2021 నుంచి 2024 మధ్య చేపట్టిన నియామకాలు, డిప్యూటేషన్లలో ప్రభుత్వ మార్గ దర్శకాలు పాటించలేదని, కోవిడ్ సమయంలో అక్రమంగా నియామకాలు చేపట్టారని, ఇందులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదంటూ మరో 8 అంశాలపై 12 మంది ఉద్యోగులపై ఫిర్యాదు అందింది. దీనిపై విజిలెన్స్ అధికారులు స్పందించి మార్చి 3న 12 మంది ఉద్యోగులకు 11 నుంచి 13 తేదీల మధ్య వ్యక్తిగతంగా విచారణకు హాజరు కాలవాలని నోటీసులు ఇచ్చారు. ఆ 12 మందిలో కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కరకుమార్‌తో పాటు గతంలో డీఎంహెచ్‌వోకు సీసీలుగా పని చేసిన సోమేశ్వరరావు, నారాయణ కూడా ఉన్నారు. వీరితో పాటు సీనియర్, జూనియర్ సహాయకులు డి.సంతోష్, జి.వెంకటస్వామి, ఆశా కుమారి, పి.దుర్గాప్రసాద్, దుర్గాప్రసాద్‌దాస్, ఇతర ఆరోగ్య సిబ్బంది జి.వి.నరసింహం, పుక్కళ్ల ఆనంద్, సీహెచ్ వెంకటరావు, అటెండర్ దుర్గారావు ఉన్నారు. వీరందరూ విచారణకు హాజరై లిఖితపూర్వకంగా వాంగ్మూలాలు ఇచ్చారు. 12 మందిలో సోమేశ్వరరావు మినహా మిగతా వారందరిపైనా ఎప్పట్నుంచో అనేక అభియోగాలున్నాయి. గత డీఎంహెచ్‌వో యూనియన్ చెప్పిన పనులు చేయలేదని, ఆ మేరకు ఆమెను ఇరకాటంలో పెట్టాలని చూడగా సోమేశ్వరరావు రూల్స్ మేరకు అడ్డు తగలడం వల్లే ఆయనపై ఫిర్యాదు చేశారు తప్ప డీఎం హెచ్‌వో కార్యాలయంలో జరిగిన అవకతవకల వ్యవహారంలో ఆయనకు సంబంధం లేదన్న విషయం కార్యాలయ వర్గాలే చెబుతున్నాయి.

### దొరక్కుండా జాగ్రత్తపడ్డారు

ఒకవైపు ఈ విచారణ నడుస్తుండగానే సీనియర్ సహాయకురాలు కాంతమ్మ (దివ్యాంగురాలు)కు రీపోస్టింగ్‌లో ప్లేస్ అలాట్ చేయడానికి రూ.20వేలు డిమాండ్ చేస్తూ ఏసీబీకి డీఎం హెచ్‌వో బాలమురళీకృష్ణతో పాటు సీసీ వాన సురేష్ చిక్కారు. ఈ వ్యవహారంలో మరో ఇద్దరు తప్పించుకున్నారని జిల్లా కార్యాలయ ఉద్యోగులు చెబుతుంటే.. కాదు కాదు వారే ఈ ట్రాప్ విషయంలో కాంతమ్మకు సహకరించారని మరికొందరు చెబుతున్నారు. కాంతమ్మ నుంచి వసూలుచేసిన రూ.20వేలను డీఎంహెచ్‌వోతో పాటు మరో ఇద్దరు పంచుకోవాల్సి ఉంది. అందులో సూపరింటెండెంట్ భాస్కర కుమార్‌తో పాటు డీపీఎం డాక్టర్ బి.రవీంద్ర ఉన్నారు. డీఎం హెచ్‌వో కార్యాలయంలో డబ్బులు లేకుండా పనులు జరగడం మానేసి నాలుగు దశాబ్దాలైపోయింది. ఎవరూ ఇందుకు అతీతులు కాకపోయినా బాలమురళీకృష్ణ మాత్రం నేరుగా సొమ్ములు తీసుకోవడంతో తక్కువ కాలంలోనే పతాక శీర్షికలకు ఎక్కిపోయారు. సాధారణంగా డీఎంహెచ్‌వోకు డబ్బులివ్వాలంటే సీసీలు వసూలు చేస్తారు. లేదూ అంటే సంబంధిత సూపరింటెండెంటో, లేదా సీనియర్ అసిస్టెంటో వసూలుచేసి డీఎంహెచ్‌వోకు ఏక మొత్తంలో ఖర్చులు తీసేసి ఒకేసారి లెక్కలు అప్పజెబుతారు. కానీ బాలమురళీకృష్ణ ఈ సీటులో కూర్చున్న దగ్గర్నుంచి కొత్త సంస్కృతికి తెర లేపారు. సూపరింటెండెంట్లు,

- మిగతా చివరి పేజీలో

## దమ్మలవీధిలో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక దమ్మలవీధిలో ఉన్న అభయాంజనేయ మండపంలో స్వామివారి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దమ్మలవీధి వాటర్‌ట్యాంకు ప్రాంతాల్లో పర్యటించి తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలను పలకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కేశవ రాంబాబు, మత్స్యకార సంఘ నాయకుడు మైలపల్లి నర్సింహామూర్తి, టీడీపీ నాయకులు బుర్రా ప్రసాద్, వంగా మహేష్, రాయితి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తూరు టీడీపీలో గ్రూపుల గోల!

- ❖ఇప్పటికే ఒక కార్యాలయం ఉండగా.. మరొకటి ప్రారంభం
- ❖దీనికి స్వయంగా ఎమ్మెల్యే తనయుడే రిబ్బన్ కటింగ్
- ❖ఇదేమిటని ప్రశ్నిస్తున్న ప్రత్యర్థివర్గం

(సత్యంన్యూస్, కొత్తూరు)

జిల్లాలో పాతపట్నం నియోజకవర్గానికి ఎంత ప్రత్యేకత ఉందో.. ఆ నియోజకవర్గంలో భాగమైన కొత్తూరు మండలానికి అంతే ప్రత్యేకత ఉంది. నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎవరున్నా, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీలో గ్రూపుల గోల మాత్రం తప్పదంటున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ గూటికి చేరిపోయే గ్రూపులు.. ఆధిపత్యం కోసం పోరాడుతుంటాయి. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. తాజాగా మండల కేంద్రమైన కొత్తూరులో శుక్రవారం టీడీపీ కార్యాలయం ప్రారంభమైంది. విశేషమేమిటంటే ఇక్కడ ఇప్పటికే ఎమ్మెల్యే కార్యాలయం ఉండగా, ఇప్పుడు రెండో కార్యాలయాన్ని.. అది కూడా సాక్షాత్తు ఎమ్మెల్యే తనయుడు మామిడి గణేష్ ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఈ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావే ప్రారంభించాల్సి ఉంది. అయితే ఇప్పటికే కొత్తూరు పార్టీలో గ్రూపుల గోల భరించలేక ఆరోగ్య సమస్య సాకుతో ఆయన డుమ్మా కొట్టి తన తనయుడిని పంపారని అంటున్నారు. ఇప్పటికే ఒక కార్యాలయం ఉండగా, రెండో కార్యాలయం అవసరమేమిటని పార్టీలోని ప్రత్యర్థి వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల మరోసారి కొత్తూరు గ్రూపు రాజకీయాలు తెరపైకి వచ్చినట్లయ్యిందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నుంచీ ఇదే తీరు కొనసాగుతుండగా జిల్లా నేతలకు కూడా గ్రూపులను సర్దుబాటు చేయడం తలనొప్పిగా మారిందంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలు దెబ్బతినే ప్రమాదముందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లామంత్రి, ఇతర ముఖ్యనేతలు కొత్తూరు గ్రూపులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.









• ఎడిటోరియల్

# దేశాన్ని తెగిడినా.. మోదీని పొగిడితే చాలా?

కొన్ని సందర్భాల్లో రోగుల శరీరంలో అవయవాలు చిట్లిపోయి అంతర్గత రక్తస్రావం జరుగుతుంది. పరిస్థితి తీవ్రతకు అది చిహ్నం. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడుగా ప్రారంభించిన సుంకాల దాడి వల్ల ప్రపంచానికి.. ముఖ్యంగా అమెరికాకు అలాంటి ముప్పే పొంచి ఉందని జేపీ మోర్గాన్ బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త బ్రూస్ కాస్‌మాన్ హెచ్చరించాడు. దేర్ విల్ బి బ్లడ్ (రక్తస్రావం జరగొచ్చు) అనే శీర్షికతో తమ ఖాతాదారులకు ఆయన వెల్లడించిన విశ్లేషణ ప్రపంచ వ్యాప్త వార్తగా నిలిచింది. ట్రంప్ దెబ్బకు ఎస్ అండ్ పి 500 సూచీలో కంపెనీల షేర్ల ధరలు ఒక్క రోజే 2.4 లక్షల కోట్ల డాలర్ల మేర పతనమయ్యాయి. ప్రపంచం మాంద్యంలోకి దిగజారే ముప్పు 40 నుంచి 60 శాతానికి పెరిగినట్లు జేపీ మోర్గాన్ హెచ్చరించింది. ఏప్రిల్ రెండో తేదీని అమెరికా విముక్తి దినంగా ట్రంప్ అభివర్ణించారు. అయితే అది ప్రపంచానికి దుర్దినంగా మారింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారిగా అమెరికా గృహస్తులు పెద్ద మొత్తంలో కాఫీ దగ్గర నుంచి కార్ల వరకు భారాలు మోయాల్సి వస్తుందని కాస్‌మాన్ చెప్పారు. అమెరికా విధానాల్లో ఎలాంటి మార్పులు లేకపోతే మాంద్యం ఈ ఏడాది ప్రపంచవ్యాపితం కావచ్చన్నారు. చర్యకు ప్రతిచర్య ప్రకృతి ధర్మం. ట్రంప్ బాణాల దెబ్బలు తిన్నవారు ప్రతి శస్త్రాలను సంధించకమానరు. వాటి పర్యవసానాలు అమెరికా.. కేవలం పెంగ్విన్ పక్షులు మాత్రమే ఉండే అంటార్కిటికా ప్రాంతంతో సహా యావత్ ప్రపంచం మీద ఉంటాయని విశ్లేషణలు వెలువడ్డాయి. మనతో సహా అనేక దేశాల స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. దిగిన తర్వాత గానీ చెరువు లోతు తెలియదు, ఇల్లలకగానే పండుగ కాదు అన్నట్లుగా పన్నుల పెంపుదల ప్రకటన చేయగానే అంతా అయిపోయినట్లు భావించనవసరం లేదు. కెనడాపై విధించిన భారాలను అంగీకరించేది లేదని నలుగురు అధికారపక్ష సెనెటర్లతో సహా ప్రతిపక్షం పెట్టిన తీర్మానాన్ని అమెరికా సెనెట్ ఆమోదించింది. తనకున్న అధికారాలతో ట్రంప్ దాన్ని తోసిరాజనవచ్చు. కానీ తనకు సెగ తగిలిన కారణంగానే పన్నుల గురించి చర్చించటానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటన చేయకతప్పలేదు. అయితే ఆయన సలహాదారులు మాత్రం అబ్బే అలాంటిదేం లేదు, ప్రకటించిన పన్ను మొత్తాలు బేరసారాలాడేందుకు కాదని వెంటనే వివరణ ఇచ్చారు. తమ దేశ తొత్తు ఇజ్రాయిల్‌తో సహా వంద దేశాల మీద టారిఫ్‌ల తొడగొట్టడం ద్వారా ట్రంప్ ఒకవిధంగా అమెరికాను ఒంటరిని చేశాడనే చెప్పాలి. బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చచ్చినట్లు, గడ్డిపోచలతో మదగజాన్ని బంధించినట్లు యావత్ దేశాలు తలచుకొంటే ట్రంప్ దిగిరాక తప్పదు. అయితే పరస్పరం విధించుకొనే పన్నులు సామాన్యులను బికారులను చేస్తాయే తప్ప పాలకవర్గాల ప్రతినిధులుగా ఉన్న కార్పొరేట్లకు జరిగే నష్టమేమీ ఉండదు. ట్రంప్ విధించిన టారిఫ్‌ల ద్వారా ప్రతి ఏటా అమెరికా ప్రభుత్వానికి 600 బిలియన్ డాలర్ల అదనపు రాబడి వస్తుందని అంచనా. మరో విధంగా చెప్పాలంటే ఆ మొత్తంలో నామమాత్రపు భారాన్ని దిగుమతిదారులు, అత్యధిక భారాన్ని వినియోగదారులే భరిస్తారు. అప్పుడు అధికారంలో ఉన్నవారికి సెగ తగులుతుంది. అందుకే ఒక దశ తర్వాత ట్రంప్ వెనక్కు తగ్గవచ్చనే అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి, తెగేదాకా లాగితే ఆ పెద్దమనిషి పదవికే ఎసరు వస్తుంది. కొత్త పన్నులతో అమెరికాలో ద్రవ్యోల్బణం 3 నుంచి 3.5 శాతానికి పెరుగుతుందని అంచనా. జేపీ మోర్గాన్, గోల్డ్‌మన్ శాచస్, మూడీస్, తదితర సంస్థల విశ్లేషకులు ఎటు తిప్పి ఎటు చెప్పినా వాణిజ్య యుద్ధం ఒక విషవలయం వంటిది. ద్రవ్యోల్బణం పెరిగితే, ధరలు పెరిగి వినియోగదారుల విశ్వాసం, కొనుగోలు శక్తి తగ్గుతుంది. అది వృద్ధిరేటు మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. నిరుద్యోగం పెరగడానికి దారితీస్తుంది. దశాబ్దాల తరబడి సాగుతున్న వాణిజ్య వివాదాలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. గత కొన్నేళ్లుగా ప్రపంచ ఆర్థిక మౌలిక అంశాలు బలహీనంగా ఉన్నాయి. ఈ సమయంలో గోరుచుట్టు మీద రోకటి పోటులా తగిలిన ట్రంప్ టారిఫ్‌లు దేనికి దారితీస్తాయో తెలియని అయోమయానికి కారణం అవుతున్నాయి. 'ప్రధాని మోదీ మంచివాడే.. భారతే చెడ్డది' అన్న ట్రంప్‌ను ఆత్మగౌరవం కలిగిన భారతీయులెవరూ సహించకూడదు. అసహ్యకర (డర్టీ) పదిహేను దేశాలు అంటూ మీడియాలో వర్ణిస్తున్నా మౌనమే. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నా ట్రంప్ పన్నుల బాదుడు మనకు ప్రయోజనకరమా? హానికరమా? అన్నది చెప్పకుండా తారె 140 కోట్ల జనాభాకు జవాబుదారీ అని నరేంద్రమోదీ ఎలా చెప్పుకోగలరు?

# దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ దినాలు పాటిద్దాం




(సత్యంన్యూస్, టెక్కలి)

ఫూలే జయంతి(11ఏప్రిల్)నుండి అంబేడ్కర్ జయంతి(14ఏప్రిల్) వరకు దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటిద్దామని కుల నిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్ష, సహాయ కార్యదర్శులు బెలమర ప్రభాకర్, రాకోటి రాంబాబులు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఉదయం 10గంటలకు గొడగలి వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో పాలిస్తున్న పాలకులు ప్రజా వ్యతిరేకపాలన సాగిస్తున్నారన్నారు. దేశసంపద కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని, అందులో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడానికి సిద్ధం చేస్తున్నారన్నారు. బస్తర్‌లో భూమి కింద ఉండే గనులను అడవులను కట్టబెట్టడానికి అడ్డువచ్చే ఆదివాసీలను చంపుతున్నారన్నారు. రాష్ట్రంలో పాలిస్తున్న పాలకులు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఒక్కటికూడ అమలు చేయకుండా సూపర్ సిక్స్ నామజపం చేస్తున్నారు తప్ప అమలుకు మాత్రం నోచుకోవడం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ సొమ్మును వారికి ఖర్చు చేయకుండా ఇతర రంగాలకు మళ్లిస్తున్నారని విమర్శించారు. అయినప్పటికీ దళిత ఎమ్మెల్యే, ఎంపీలు ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ రుణాలు కనీసం మండలానికి 100 చొప్పున ఇవ్వాలని, మున్సిపాలిటీకి 150 యూనిట్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ నిధులు గ్రామీణ ప్రాంత దళిత, ఆదివాసీల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క క్రిష్ణయ్య, గొడగల సంఘం నాయకులు అశోక్, సురేష్, రామారావు, భాస్కర్, సావిత్రి, సులోచన, రమణమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ఏకైక పార్టీ బీజేపీయే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని శ్రీకాకుళం జిల్లా సీనియర్ నేత పైడి రాజారావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రం స్థానిక పీఎన్‌కాలనీలో ఆ పార్టీ సీనియర్ నేత పైడి రాజారావు ఆధ్వర్యంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ సీనియర్ నాయకులు రెడ్డి నారాయణరావు ఆవిష్కరించారు. అనంతరం పైడి రాజారావు మాట్లాడుతూ దేశంలో ప్రజల ఆర్థిక స్థితి గతులను మెరుగుపరుస్తూ వారి అభ్యున్నతికి దేశ ప్రధాని నరేంద్రమోడీ నిరంతరం విశేష కృషి చేస్తున్నారన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి దేశ ప్రజల అభివృద్ధికి నాంది పలుకుతూ నేడు వారి సంక్షేమానికి కృషి చేస్తున్న పార్టీ బీజేపీయేనన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ ప్రజల కోసమే పరితపించే బీజేపీ రానున్న రోజుల్లో మరింత సుభిక్ష సంక్షేమ పాలన అందించేందుకు మోడీ నాయకత్వంలో ముందుకు వెళ్ళనున్నట్లు చెప్పారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతాడ భూషణరావు, పైడి సత్యం, పైడి సాంబమూర్తి, బి లక్ష్మణరావు, పప్పల సూర్యరావు, బగాది కృష్ణారావు, సనపల ముకుంద, గొల్లపల్లి సన్యాసిరావు, కూన గోపి, గడప ఖగేష్, మామిడి ప్రభుప్రసాద్, సన్నిబాబు రెడ్డి, తేజేశ్వర్ రెడ్డి, పండు, చౌదరి ధనలక్ష్మి, సనపల దాలప్పుడు, కనుమెట్ట వెంకటరమణ, పైడి విఠల్, అన్నెపు లక్ష్మీనారాయణ, పైడి అమ్మినాయుడు, కె.తిరుపతిరావులు పాల్గొన్నారు.



# ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉచిత వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య తనిఖీలు నిర్వహించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. రూరల్ మండలం సింగుపురంలో హారకేశ్వర కళావేదికలో ఉచిత వైద్యక్యాన్సర్, రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఎక్కువగా ప్రజల్లో క్యాన్సర్ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. అందువల్ల ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసి తనిఖీ నిర్వహించుకోవాలన్నారు. నియోజకవర్గంలో మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏబీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనరల్‌చెకప్, బీపీ షుగర్, కళ్ళు, దంతాలు, గర్భిణీ స్త్రీలకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, ఉప సర్పంచ్ కుంచాల ఆదినారాయణ మాజీ సర్పంచ్ గుండమోహనరావు తదితరులు పాల్గొన్నారు.



# అమెరికాలో కూన రవికుమార్ పర్యటన

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అమెరికా పర్యటనలో భాగంగా టెక్సాస్ యూఎన్‌టీ (యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్)లో సీఏఏఏఎం (సెంటర్ ఫర్ ఏజిలీ అండ్ అడాప్టివ్ ఎడిటివ్ మ్యానుఫేక్చరింగ్)లో వివిధ విభాగాలలో జరుగుతున్న రీసెర్చ్, ఇన్నోవేషన్‌ని పరిశీలించారు. అమెరికాలో విద్యా వ్యవస్థలో ఉన్న టెక్నాలజీ, తయారీ రంగంలో ఉన్న టెక్నాలజీలను అడాప్ట్ చేసుకొని ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్ఆర్ఐ మిత్రులు ప్రైవేట్ యూనివర్సిటీలు, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ ప్రారంభించి రాష్ట్ర యువతకి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు






# సినిమా తీయడమే కాదు.. వెరైటీ ప్రమోషనూ ముఖ్యమే!

పటాస్ సినిమాతో ఒక్కో టపాసు పేల్చుకుంటూ దర్శకుడిగా సినీ వినీలాకాశంలో దూసుకుపోతున్నాడు అనిల్ రావిపూడి. ఇతని ఖాతాలో ఫెయిల్యూర్స్ కన్నా సక్సెస్ లే ఎక్కువగా ఉన్నాయి. సరే ఇతని సినిమా చూసిన వాళ్లు బాగుందనో.. బాలేదనో రివ్యూలు రాస్తారు. అది సాధారణం. కానీ నేను రాయబోయేది అతని మూవీ మేకింగ్ స్టైల్ అండ్ ప్రమోషన్ టాస్క్ గురించి నిజానికి నాకు అనిల్ రావిపూడి లో నచ్చింది ఈ వెరైటీ ప్రమోషన్లే. సాధారణంగా ఏ దర్శకుడైనా సినిమా ప్రారంభాన్ని ఫిల్మ్ నగర్ గుళ్ళోనో .. ఇంకెక్కడో కొబ్బరికాయ కొట్టి ఆవిష్కరించుకుంటాడు. అక్కడితో నేరుగా సినిమా షూటింగులు మొదలౌతాయి. కానీ అనిల్ రావిపూడి రూటే సెపరేటు. సినిమా ముందు సినిమా తర్వాత కూడా మూవీని డిఫరెంట్ గా ప్రమోట్ చేయడంలో అనిల్ దిట్ట అయిపోయారు. ఈ మధ్య వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ప్రమోషన్ కూడా మూవీ టీమ్ తో రోజుకో సెలబ్రిటీ ఇంటికి పోయి డిఫరెంట్గా చేశాడు. నిజానికి పెయిడ్ యాడ్స్ కన్నా అనిల్ రావిపూడి వెరైటీగా చేసిన మూవీ ప్రమోషనే బాగా పేలింది. తాజాగా ఇప్పుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా మెగా 157 బ్యానర్ తో ఓ సినిమా అనౌన్స్ చేసారు. పూజాదికాలు అయిన తర్వాత ఈ మూవీ లాంచింగ్ కూడా వెరైటీగా ప్లాన్ చేశాడు అనిల్. ఒక స్టూడియోలో చిరంజీవి గత సినిమాల్లోని కటౌట్లు పెట్టి వాటి పక్కన ప్రొడక్షన్ టీమ్.. రైటర్స్ టీమ్.. మ్యూజిక్ టీమ్.. ప్రొడ్యూసర్స్.. ఇలా అన్ని క్రాఫ్ట్స్ కి చెందిన వాళ్ళని నిలబెట్టి చిరంజీవితో సెల్ఫ్ ఇంట్రడ్యూస్ చేసుకునే కార్యక్రమం ప్లాన్ చేసి ఆఖరికి దర్శకుడిగా తనను కూడా చిరంజీవికి పరిచయం చేసుకోవడం వెరైటీ గా అనిపించింది. టీవీల్లో లక్షలు ఖర్చు పెట్టి ఇచ్చే పబ్లిసిటీ కన్నా ఇటువంటి వినూత్న ప్రయోగాలే జనాలకు ఎక్కువగా రీచ్ అవుతాయి.

- పరేష్ తుర్లపాటి

# బ్యాంకాక్ కొండలు కోనల్లో యువనటి గట్స్

పచ్చని ప్రకృతిని ఆస్వాదించే మనసుండాలే కానీ ఈ ప్రపంచంలో ఎగ్జోటిక్ లొకేషన్లకు కొదవేమీ లేదు. అందునా బ్యాంకాక్ అడవుల్లో సుదూర తీరాన పచ్చందాలను తని వి తీరా ఆస్వాదించి తీరాల్సిందే. అక్కడ కొండలు కోనలు గుట్టలు నదీ సముద్ర జలాల్లో విహరిస్తే కలిగే మజానే వేరు! ప్రస్తుతం అలాంటి అద్భుతమైన విహారయాత్రను ఆస్వాధిస్తోంది మెహ్రీన్ ఫీర్జదా. తాజాగా కొండల మధ్య పచ్చని జలాల్లో బోట్ షికార్ చేస్తూ కనిపించింది. ఎత్తైన పర్వతాల నడుమ పచ్చని నీడ ఆ నది నీటిలో ప్రతిబింబిస్తోంది. అలాంటి చోట మెహ్రీన్ తనను తాను మర్చిపోయి ఇదిగో ఇలా ఫోజులిచ్చింది. హాఫ్ షోల్డర్ ఫ్రాక్ లో థై అందాలను కూడా ప్రదర్శిస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం మెహ్రీన్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్‌గా మారుతోంది. చేతిలో సినిమాల్లేవ్. కావాల్సినంత తీరిక సమయం ఉంది. దానిని ఇలా సద్వినియోగం చేస్తోందంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఏదైనా ట్రావెల్ మ్యాగజైన్ షూట్ కోసం అక్కడికి వెళ్లిందా? అని కూడా సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు ఇలియానా ఫిజీ దీవికి ఇదే తరహాలో ప్రచారం కల్పించింది. ఇప్పుడు మెహ్రీన్ బ్యాంకాక్ అందాలను ప్రమోట్ చేయబోతోందా? అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ అన్నిటికీ మెహ్రీన్ స్వయంగా స్పందించాల్సి ఉంటుంది. ఎఫ్ 2 ఫ్రాంఛైజీ సినిమాల తర్వాత మెహ్రీన్‌కి సరైన ఆఫర్ లేదు. మునుముందు ప్రయత్న లోపం లేకుండా ఏదైనా మాయాజాలం సృష్టిస్తుందేమో చూడాలి.



- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపబడుతున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 20వ బ్యాచ్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్ సోమవారం ప్రారంభించారు. అనంతరం 21వ బ్యాచ్‌లో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండిన వారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్‌కు అర్హులన్నారు. మొత్తం శిక్షణ 40రోజుల పాటు వుంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7382923293, 7095040608 ఫోన్‌నంబర్స్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపో మేనేజర్లు అమర సింహుడు, శర్మ, పర్సనల్ ఆఫీసర్ కృష్ణవేణి, అసిస్టెంట్ మేనేజర్ రమేష్, శిక్షకుడు జి.న్.రావు, సుమన్ పాల్గొన్నారు.



## కాలువ సైజు తగ్గించేశారు



(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి గోపినాధపురం ఊరచెరువుకు పోయే వంశధార 49ఆర్-1ఆర్ కాల్వను తెలుకలవీది నుండి కోదండరామవీది ప్రక్కన బన్నువాడ రోడ్ వైపుకు మార్పు చేసి, కాల్వ సైజును తగ్గించేశారని రియల్‌ఎస్టేట్ వ్యాపారానకు అనుకూలంగా కాల్వస్థితిని మార్చివేస్తే, రెవిన్యూ, వంశధార అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి యల్లయ్య, హెచ్.ఈశ్వరరావులు అన్నారు. కాల్వను లోతు చేసి ఊరచెరువుకు నీరు వెళ్ళే విధంగా మరమ్మతులు చేపట్టాలని, అలాగే బన్నువాడ వైపునకు పోతున్న 49ఆర్ నుండి జయక్రిష్ణాపురం ఊరచెరువుకు పోయే కాల్వను మరమ్మతులు చేపట్టాలని గ్రామ పెద్దలు, ప్రజలు పలుమార్లు ప్రభుత్వానికి అర్జీలు ఇచ్చి మొర పెట్టుకున్నారని గుర్తు చేసారు. తక్షణం రెవెన్యూ, వంశధార అధికారులు స్పందించి కాల్వను పునరుద్ధరణ చేసి మరమ్మతులు చేపట్టి రైతాంగంనకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని బగాది వాసుదేవరావు, బమ్మిడి సోమేసులు ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రజలందరూ శ్రద్ధ చూపాలన్నారు. డాక్టర్ జి.ఆర్.శ్రీకాంత్ రోగులను పరీక్షించి అవసరమైనవారికి రెడ్ క్రాస్ చైర్మన్ చేతుల మీదుగా మందులు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి మల్లేశ్వర రావు, బి.చిన్మయిరావు, ఎం.కళ్యాణ్ చక్రవర్తి, ఎ.నర్సింగరావు, గుణాకర రావు, కే సత్యనారాయణ, జి రమణ బి సతీష్ కుమార్, బేగం, పి చైతన్య కుమార్, సుజాత, ఎన్.ఉమా శంకర్‌లు పాల్గొన్నారు.

## పిల్లల పార్కును నిర్మించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పొన్నాడ బ్రిడ్జికి వెళ్ళే దారిలో సుమారు య.0.10సెంట్లు స్థలంలో ప్రభుత్వం మరుగుదొడ్లు ఉండేవని, సదరు మరుగుదొడ్లు 2005లో పడగొట్టడంతో ప్రస్తుతం ఆ స్థలం ఆక్రమణకు గురవుందని తక్షణమే ఈప్రాంతంలో వృద్ధులు, పిల్లల పార్కును కట్టాలని 28వ డివిజన్‌కు చెందిన దాసరి తిరుమలరావు మాదిగ కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సదరు ఆక్రమించిన స్థలములో షాపులు అద్దెలకు ఇస్తూ కొంతమేర ప్రహరీ గోడ కట్టేశారన్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ అప్పటి నాయకులను మేనేజ్ చేసుకుంటూ వచ్చారన్నారు. ఈ విషయములో మేము ఆర్.టి.ఐ.యాక్టు ద్వారా దరఖాస్తు పెట్టినప్పటికి సర్వేయర్లు వచ్చి సర్వే చేస్తుంటే సదరు స్థలమును కబ్జా చేసిన వ్యక్తులు వచ్చి తమను దుర్భాషలాడుతున్నారన్నారు. ఈ విషయమై కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్, టౌన్, సచివాలయం సర్వేయర్లకు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము స్థలాన్ని స్వాధీనం చేసుకుని 28వ డివిజన్లో వున్న వృద్ధులకు, పిల్లలకు 'పార్కును' ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు.



## దూరదర్శన్ ప్రాంతీయ వార్తా విభాగం అధిపతిగా షఫి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయవాడ దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగం అధిపతిగా షఫి మహమ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. షఫి మహమ్మద్ 2009 బ్యాచ్ కు చెందిన ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారి. ఆయన 2024 నవంబర్ నుంచి ప్రాంతీయ వార్తా విభాగంలో సహాయ సంచాలకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఒడిషా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబార్ పోర్టుబ్లయిర్లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పలు విభాగాల్లో పని చేశారు. క్షేత్రప్రచార విభాగం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, ఆకాశవాణిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తించారు. కేంద్ర ప్రభుత్వంచే వెలువడుతున్న యోజన అభివృద్ధి మాసపత్రికకు సంపాదకుడిగా, డిఒపిటి ప్రాంతీయ సంక్షేమ అధికారిగా విధులు నిర్వహించారు. దూరదర్శన్ వార్తా విభాగాన్ని మరింతగా మెరుగ్గా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ పథకాలను దూరదర్శన్ ద్వారా ప్రజల్లోకి తీసుకొని వెళ్లడానికి కృషి చేస్తానని షఫి మహమ్మద్ తెలిపారు.



## ఇంజరాపు మోహన్‌కు ఉగాది పురస్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రముఖ సంఘ సేవకులు, అరసవల్లికి చెందిన ఇంజరాపు మోహన్‌కు మణిపాత్రుని క్రియేటివ్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా క్రియేటివ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇంజరాపు మోహన్ పలు సేవాకార్యక్రమాలను చేపడుతున్నారని వివరించారు. ముఖ్యంగా తన సాయిసూర్య యోగా సెంటర్ ద్వారా ఎందరినో ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు.



## కడు రమణీయం... రాములోరి కళ్యాణం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీరాముని కల్యాణాన్ని హయాతినగరం రెల్లివీధిలో టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ కవ్వాడిరవి, సుశీల దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరైన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రాముడు ఆదర్శప్రాయుడన్నారు. ధైర్యవంతుడు, క్రోధాన్ని జయించినవాడు, తేజస్సు కలిగినవాడు, ఎదుటివారిలో మంచిని చూసేవాడు శ్రీరాముడు అని తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు మాదరపు వెంకటేష్, టీడీపీ నాయకులు తోనంగి వెంకన్న యాదవ్, జామి భీమశంకర్, రెల్లివీధి పెద్దలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## తెరవేకి శ్రీరామనవమి పురస్కారాలు



(సత్యంన్యూస్, పలాస)

శ్రీరామనవమి సందర్భంగా పలాసలో జనజాగృతిసాహితి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీరామనవమి- ఉత్తరాంధ్ర జన కవన సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ చైతన్య కిరణాల అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు (ఉమాకవి)కి శ్రీరామనవమి పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో "ఏమి రుచిరా,," పాట పాడి, శ్రీరాముడు మహాత్ముడు కవిత చదివి వినిపించినందుకు పురస్కారం అందజేశారు. అదేవిధంగా శ్రీకాకుళం తెలుగు రచయితలు వేదిక సభ్యులకు శ్రీరామనవమి పురస్కారాలు అందిస్తూ గౌరవించారు. ఈ పురస్కారాల్లో తెలుగు రచయితల వేదిక అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కనుగుల సత్యం, ముట్నూరు ఉపేంద్రశర్మ, లింగరాజు మాస్టారు, కిల్లాన శ్రీనివాసరావు, ఇద్ది పాపయ్యతోపాటు భోగెల ఉమామహేశ్వరరావును జనజాగృతి సాహితీ సంస్థ గౌరవ ప్రతినిధులు, పలాస లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తెప్పల కృష్ణమూర్తి, కుమార్ నాయక్, బమ్మిడి సుబ్బారావు, పూణ్ణ వెంకటరంగనాథ్, మధుసూదనాచారి, కె.వి.రాజారావు, కుదమ తిరుమలరావు, వంకల రాజారావు, కొత్తపల్లి చిన్నబాబులు పాల్గొన్నారు

## కార్యకర్తల అండదండలే టీడీపీకి శ్రీరామరక్ష

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు, ప్రజల అండదండలే శ్రీరామరక్ష అని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. 44వ డివిజన్ రెల్లివీధిలో పార్టీ ఇన్‌చార్జ్ కవ్వాడి సుశీల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సభ్యత్వ కార్డుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పార్టీని ఉపయోగించుకొని పదవులనుభవించి కొంత మంది నాయకులు పార్టీను వదిలిపోయినా చంద్రబాబునాయుడు నిరంతరం అలుపెరగని పోరాటమే పార్టీ నిలబడడానికి కారణమయ్యాయన్నారు. రాష్ట్ర భవిష్యత్ భరోసా కోసం నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో టీడీపీ బలోపేతానికి, అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏయూ సిండికేట్ మాజీ సభ్యులు డాక్టర్ జామి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## విలియంవర్డ్స్ వర్త్ జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆడవరం పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు భోగెల ఆధ్వర్యంలో 4వ తరగతి ఆంగ్లం పుస్తకంలో ఉన్న "ద కిట్టెన్ అట్ ప్లే" రచించిన ఆంగ్లరచియత విలియం వర్డ్స్ వర్త్ జయంతి సందర్భంగా ఆ పాఠం చెప్పి 1770 ఏప్రిల్ 7న జయంతి కనుక విద్యార్థులకు అవగాహన కల్పించడానికి అయన రచించిన "ఎన్ ఈవినింగ్ వాక్", ధ రైమ్ ఆఫ్ ది ఎన్సెంట్ మారినర్", గైడ్ టు ది లేక్స్ లో ప్రకృతిలో రమణీయత గురించి వర్ణనతో కూడిన రచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.





స్థానిక విశాఖ-బి కాలనీలో గల షిర్డీసాయి ఆలయంలో సోమవారం నిర్వహించిన రాములవారి కళ్యాణంలో అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొంక్యాన మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## లయన్స్ క్లబ్ సేవలు వెలకట్టలేనివి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

శ్రీకాకుళం జిల్లా లయన్స్ క్లబ్ సేవలు వెలకట్టనివని, సమాజ సేవకై యువతకు ప్రోత్సాహం అందిస్తామని జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్ సోమవారం అన్నారు. నరసన్నపేట లయన్స్‌క్లబ్ మిలీనియం స్థాపించి 25 ఏళ్లు అయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక ఒక ప్రైవేట్ హాల్‌లో లయన్స్ 316-ఏ రీజనల్ కాన్ఫరెన్స్, రీజియన్ చైర్మన్ వీవీ రంగనాథ్ నేతృత్వంలో లయన్స్‌క్లబ్ నరసన్నపేట ఆతిథ్యంలో జరిగిన కార్యక్రమలో పూర్వపు లయన్స్ గవర్నర్‌లు డివిఎస్.రాజు, డిఎస్ఎస్వీ వర్మ, ప్రస్తుత రెండవ వైస్ గవర్నర్ కె వి సుబ్బరాజు, ఇతర రీజియన్ చైర్మన్‌లు, జోన్ చైర్మన్‌లు, రీజియన్ 1 పరిధిలో 12 క్లబ్స్ నుండి 150 మందికి పైగా లయన్స్ సభ్యులు హాజరయ్యారని పొన్నాడ రవికుమార్ తెలిపారు. ఇందులో భాగంగా కేవీ సుబ్బరాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో అన్నిటికీ ధీటుగా ఉండటమే లయనిజమన్నారు. ఉత్సాహంతో ముందుకు వెళ్తూ, శ్రీకాకుళం జిల్లాలో సేవా కార్యక్రమాల్లో మొదటిస్థానంలో నిలిచే విధంగా కొనసాగాలన్నారు. విశిష్ట సేవలందించిన లయన్స్ సభ్యులకు అవార్డ్సతోపాటు, ప్రతి లయన్స్‌కు 60 రీజినల్ అవార్డ్‌ను, ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించారు. నటుకుల మోహన్, బాల గంగాధర్, వివి.సోమేశ్వరరావు, కాన్ఫరెన్స్ చైర్మన్‌లు పాల్గొన్నారు.




## అక్రమ సస్పెండ్ రద్దు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎపీఎస్ఆర్టీసీ శ్రీకాకుళం జిల్లా డీపీటీఓ తనకున్న అధికారాన్ని అడ్డం పెట్టుకుని అన్యాయంగా పలాస డిపో కండక్టర్‌ను సస్పెండ్ చేశారని, తక్షణమే ఆ అక్రమ సస్పెండ్ రద్దు చేయాలని ఎంప్లాయిన్ యూనియన్ నాయకులు పి.భానుమూర్తి, బీకె.మూర్తి, పి.నానాజీరావు, జి.త్రినాథ్, కె.దశరథలు డిమాండ్ చేశారు. నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. 1/19సర్క్యులర్‌ని అమలు చేయకుండా వారి ఇష్టారాజ్యంగా జిల్లాలో కొన్ని డిపోల్లో ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని యూనియన్ నాయకులు తెలిపారు. పలాస డిపో కండక్టరు ఎస్ నీలకంఠంపై టీటీఎ ఫిబ్రవరి 12న విశాఖ నుంచి పలాస డ్యూటీలో కేసు రాశారన్నారు. సదరు కేసులో పలాస డిపో మేనేజర్ పరిశీలించి మార్చి 1న సదరు కండక్టర్‌కి లిఫ్ట్ ఇచ్చి డ్యూటీకి పంపించి దానిని డీపీటీఓ సస్పెండ్ చేశారని వివరించారు. ఇది చాలా విచారకరమన్నారు. డ్రైవర్ ఆనందరావుపై శ్రీకాకుళం-2 డిపో మేనేజర్ అక్రమంగా రూ.25వేలు రికవరి ఇచ్చి రికవరి డ్యామేజీ కూడా ఇంక్రిమెంట్‌లో కోత విధించారన్నారు. 1/19 సర్క్యులర్‌కి విరుద్ధంగా సెల్‌ఫోన్ కేసులపై అన్యాయంగా జీవితకాల ఇంక్రిమెంట్లపై పనిష్మెంట్లు ఇస్తున్నారన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో శ్రీకాకుళం 1 డిపో అధ్యక్ష, కార్యదర్శులు జిబి మూర్తి, బి.రామకృష్ణ, కె.బాబూరావు, టెక్కలి డిపో అధ్యక్ష, కార్యదర్శులు బి.మురళి, ఎస్.మోహనరావు, పలాస డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎం.ఎ.రాజు, ఎ.దిలీప్‌కుమార్, పాలకొండ డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎవీ సాగర్, సీడీ నాయుడు, భారీ సంఖ్యలో ఐదు డిపోల నుంచి ఉద్యోగులు పాల్గొన్నారు.
























# తప్పుడు కేసులు రద్దు చేయాలి

**♦కలెక్టర్‌ను కోరిన డీసీసీబీ కాలనీవాసులు**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక డీసీసీబీ కాలనీ, శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని నర్సెస్ కాలనీ పరిసర ప్రాంత వాసులపై ఆక్రమణ దారులు పెట్టిన తప్పుడు కేసులు రద్దు చేయాలని కాలనీకి చెందిన పలువురు బాధితులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం జెడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల ఆస్తుల రక్షణ కోసం ఆక్రమణ దారులను అడ్డుకొనే క్రమంలో శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆక్రమణదారులు తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు బాధితులు విన్నవించారు. డీసీసీబీ కాలనీలోని శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర నర్సెస్ లే అవుట్ 1988లో డీటీపీసీ ద్వారా ఆమోదం పొందినట్టు తెలిపారు. సదరు లే అవుట్‌లో ప్రధాన రహదారి మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులుగా నిర్ధారించారని వివరించారు. ఇప్పటికీ 80 అడుగుల రహదారిగానే చలామణి అవు తుందన్నారు. దీన్ని కొందరు దౌర్జన్యంగా డాక్యుమెంట్ నెంబర్ 818/2025, 819/2025, 6296/2011ను చూపించి 80 అడుగుల రోడ్డులో పడమర వైపు 40 అడుగుల ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. ప్రజలకు చెందిన ఆస్తిని రక్షించే క్రమంలో కాలనీ వాసులంతా కలిసి పనులు అడ్డుకున్నందుకు 9 మందిపై రూరల్ పోలీస్ స్టేషన్లో తప్పుడు కేసులు నమోదు చేయించారని కలెక్టర్‌కు వివరించారు. డీటీపీసీ అప్రూవల్ చేసిన ఎల్పీ నెంబర్ 155/88లో గల 80 అడుగుల రహదారిని పబ్లిక్ ప్రాపర్టీని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని తప్పుడు కేసును ఎత్తివేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బిర్లంగి రామ్మోహన రావు, అంబటి ఉమాశంకర్ ప్రసాద్ ఉన్నారు.



# డీఎంహెచ్‌వో కార్యాలయానికి మద్దెలదరువు

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ అసిస్టెంట్లను పక్కన పెట్టి ముందు తన వాటా ఇచ్చేయాలని, ఆ తర్వాత సూపరింటెండెంట్లకు ఎంత ఇచ్చుకుంటారో తనకు అనవసరమని తెగేసి చెప్పడంతో సీసీ ద్వారా డీఎంహెచ్‌వో సొమ్ములు తీసుకునేవారు. అందుకే ఏసీబీ రైడ్ చేసే సమయానికి కాంతమ్మ ఇచ్చిన రూ.20వేలు డీఎంహెచ్‌వో జేబులోనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తమను కాదని డీఎంహెచ్‌వోనే నేరుగా డబ్బులు కొల్లగొట్టేస్తున్నారన్న అక్కసుతోనే సూపరింటెండెంట్ స్థాయి వ్యక్తులు ఈ ట్రాప్ చేయించారని ప్రచారం కూడా ఉంది.

ఇక విజిలెన్స్‌కు ఇచ్చిన ఫిర్యాదులో 12 మంది పేర్లు పొందుపర్చినా కార్యాలయంలో పనిచేస్తున్న వారంతా ఒకే తాను ముక్కలని అనేక సందర్భాల్లో స్పష్టమైంది. అయితే అంతమంది మీద ఒకేసారి ఫిర్యాదు ఇస్తే అది నీరుగారిపోతుందనే ముందుగా 12 మందిని ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న వారంతా రాజకీయ సిఫార్సులతో ఏళ్ల తరబడి కార్యాలయ కిటికీలను పట్టుకొని వేలాడుతున్నారు. జిల్లా కార్యాలయంలో పోస్టింగ్ అంటే డబ్బులు ఇచ్చి మరీ వస్తున్నవారు ఉన్నారు. వీరిలో అనేక మంది హెల్త్ అసిస్టెంట్ల నియామకంలో నిబంధనలను తుంగలో తొక్కి ఉద్యోగార్థుల నుంచి సుమారు రూ.1.07 కోట్లు వసూళ్లకు పాల్పడ్డారు. అందులో ఉన్నవారి పేర్లు విజి లెన్స్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనకపోవడం ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది. ఇలా అనేక సందర్భాల్లో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని విడిచిపెట్టి కొందరి పేర్లను మాత్రమే ప్రస్తావించడంపై కూడా భిన్నాభి ప్రాయాలున్నాయి. ఏసీబీకి చిక్కిన డీఎంహెచ్‌వో సీసీ వాన సురేష్ అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో నరసన్నపేట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆ తర్వాతే వసూళ్ల పర్వం పీక్ స్టేజ్‌కు చేరిందనే ఆరోపణ లున్నాయి. ఐడీఎస్‌పీ విభాగంలో ఖాళీ అయిన డేటా మేనేజర్ పోస్టుకు రూ.2లక్షలు డిమాండ్ పెట్టారు. డబ్బులు ఎవరిస్తే వారికే పోస్టింగ్ ఇవ్వడానికి ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు ఫైల్ పెడతామని భీష్మించుకుకూర్చు న్నారు. ఈ పోస్టుకు రూ.లక్ష ఇవ్వడానికి ఇద్దరు ఉద్యోగులు ముందుకు వచ్చినా రూ.2 లక్షలు కంటే ఒక్క రూపాయి కూడా తగ్గించేదిలేదని చెప్పి దాన్ని రెండు నెలలుగా ఖాళీ ఉంచారు. ఈ వ్యవహారంలో డీపీఎం, సూపరింటెండెంట్ తెర వెనుక ఉన్నారని కార్యాలయంలో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

**ముగ్గురే కీలకం..**

వాస్తవంగా సీసీ వాన సురేష్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎస్‌టీఎఫ్‌లో పనిచేసి, దానికి రిజైన్ చేసి వైద్య ఆరోగ్య శాఖలో పారా మెడికల్ ఉద్యోగిగా చేరాడు. సీసీ సురేష్ కానిస్టేబుల్‌గా చేరకముందే డీఎస్సీ ద్వారా వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం సాధించినా వివిధ కారణాల రీత్యా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో కానిస్టేబుల్ సెలక్షన్‌కు వెళ్లి 1998 బ్యాచ్‌కు సెలెక్ట్ అయ్యాడు. ట్రైనింగ్ పూర్తి చేసుకొని 1437 పీసీ నెంబర్‌తో ఎస్‌టీఎఫ్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. విధుల్లో చేరిన కొన్ని రోజుల తర్వాత న్యాయస్థానం తీర్పుతో వైద్య ఆరోగ్యశాఖలో పారా మెడికల్ ఉద్యోగిగా నియామక ఉత్తర్వులు అందుకున్నాడు. దీంతో కాని స్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి వైద్య ఆరోగ్య శాఖలో చేరాడు. కానిస్టేబుల్ సర్వీసుతో కలుపుకొని సురేష్ ప్రభుత్వ పెన్షన్‌కు ఎలిజిబులిటీ పొందాడు. నరసన్నపేట పరిధిలోనే ఎక్కువ కాలం పని చేసిన సురేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలల క్రితమే డీఎంహెచ్‌వో సీసీగా టీడీపీ నాయకులు సిఫార్సుతో చేరాడు. చేరిన తర్వాత వ్యవస్థనంతా డీపీఎంతో కలిసి తన చేతులో ఉంచుకొని ప్రతి పనికి ఒక రేట్ ఫిక్స్ చేసి వసూళ్లు చేయడం ప్రారంభించారు. అందులో భాగంగానే కాంతమ్మకు ఆర్‌జేడీ రీపోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చిన 45 రోజుల వరకు వర్క్ ప్లేస్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టి డబ్బులు డిమాండ్ చేశారు. వారు డిమాండ్ చేసిన డబ్బులు పట్టుకొని మొదట సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్ వద్దకు వెళ్లి ఇవ్వజూపగా, ఆయన తెలివిగా తప్పించు కొని సీసీకి ఇవ్వాలని సూచించారు. సీసీ సురేష్‌ను కలిసి ఆయన ఛాంబర్‌లో ఇవ్వాలని కాంతమ్మ నిర్ణ యించారు. ఆ సమయంలో డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో సీసీ ఉండడం, డబ్బులు తెచ్చానని కాంతమ్మ సైగ చేయడంతో లోపలికి పిలిచి డబ్బులు తీసుకొని డీఎం హెచ్‌వోకి ఇవ్వడం, ఆయన ఆ డబ్బులు జేబులో పెట్టడం, ఏసీబీ వచ్చి పట్టుకోవడం అంతా చకచకా జరిగిపోయాయి. విజిలెన్స్ కేసులు, ఏసీబీ ట్రాప్‌లు, పోలీసు కేసులు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు కొత్తకాదు. ఇప్పటి వరకు ఇక్కడ సూపరింటెండెంట్లుగా, డీఎంహెచ్‌వోలుగా పని చేసినవారిలో ఒకరిద్దరు మినహా ఫిర్యాదులు లేనివారు ఎవరూ లేరు. డీఎంహెచ్‌వోగా పనిచేసి పదవీ విరమణ చేసినా ఇప్పటికీ పింఛనుకు నోచుకోని డీఎంహెచ్‌వోలు కనీసం అరడజను మంది ఉన్నారు. కొత్తగా వచ్చిన డీపీఎం రవీంద్రలాంటి వారికి ఇంకా ఈ వాసనలు అంటనందున డీఎంహెచ్‌వోను ప్రసన్నం చేసుకుంటే జిల్లా మొత్తం చక్రం తిప్పొచ్చన్న భావనతో అందరి నెత్తిన మొత్తి అన్నిటికీ రేటు ఫిక్స్ చేస్తే ఎలా ఉంటుందో ఒక్కసారి గతంలో పని చేసినవారి వద్దకు వెళ్లి తెలుసుకుంటే బాగుంటుంది.




# బెట్టింగ్ యాప్‌లపై ఫిర్యాదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల వేదికలో ప్రముఖ సామాజిక కార్యకర్త మీసాల భానోజీ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బెట్టింగ్ యాప్‌లపై గౌరవ అధికారులకు ఫిర్యాదు చేస్తూ దేశంలో, రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌ల మాఫియా విజృంభిస్తున్నాయని, వాటిని అరికట్టడంలో తాత్సారం చేయడం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. ఎక్కువగా టీనేజర్లు, యువత, చిరు వ్యాపారులు గంజాయి కంటే ఎక్కువగా ఈ బెట్టింగ్ జాడ్యానికి బలవుతున్నారని, దీనిపై గత నెలలో 48 గంటల నిరవధిక నిరాహారా దీక్ష చేశానని, అధికారులు ఈ బెట్టింగ్ యాప్‌లను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మురపాక వైకాపా నాయకులు బాలి శ్రీనివాస్ నాయుడు, యువత పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.